కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు, నవంబర్ 27: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మండల బీఆర్ఎస్ నాయకులు కలిశారు. బుధవారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన నివాసానికి మాజీ మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సురుసాని సుదర్శన్‌రెడ్డి, తల్లోజు లక్ష్మణాచారి, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌నాయక్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సూచించారు. ప్రబుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి లేదని వివరించారు. రైతులు, ప్రజల పక్షాన వారికి న్యాయం జరిగే వరకూ పోరాడాలని తెలిపారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తిరిగి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 11నెలలైనా ప్రభుత్వం ఇచ్చిన హమీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు.

డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా జాసన్

బి.జాసన్
డిప్యూటీ లేబర్ కమిషర్

చిక్కడపల్లి, నవంబర్ 27: కార్మిక శాఖలో ఇటీవలే జరిగిన పదోన్నతుల్లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.జాసన్‌ను హైదరాబాద్-2 డిప్యూటీ లేబర్ కమిషర్‌గా నియమితులయ్యారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కార్మిక శాఖలో కార్మికుల సమస్యలు వేగవంతంగా పరిష్కరిస్తామని తెలిపారు. అర్హులకు పథకాలు త్వరితగతిన అందించడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

సేవారంగంలో సత్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన క్రిస్టియన్ అభ్యర్థులు, సంస్థలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న వేడుకల్లో సత్కారం లభించనుంది. సత్కారానికి దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ఇలియాజ్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక సేవా రంగం, విశిష్టమైన వైద్య సేవలు, విద్యా బోధన, సాహిత్యం, క్రీడారంగాల్లో పదేండ్ల పైబడి విశేషసేవలు అందించిన క్రైస్తవులు, విద్యా, సామాజిక సేవా రంగాల్లో 30 ఏండ్లపై సేవ చేస్తున్న సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను డిసెంబర్ 5లోగా జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తులు www.tscmfc.inలో గానీ, కార్యాలయం నుంచి గానీ పొందొచ్చని పేర్కొన్నారు.

ప్రాజెక్ట్ ఫెలో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 27: ఓయూ జియో ఫిజిక్స్ విభాగంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్‌లో ప్రాజెక్ట్ ఫెలో పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 'గ్రావిటీ సర్వేస్ ఇన్ పార్ట్స్ ఆఫ్ గుజరాత్, ఇండియా' పేరుతో నిర్వహిస్తున్న ప్రాజెక్టులో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 30 లోగా దరఖాస్తులను తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎమ్మెస్సీ జియోఫిజిక్స్ పూర్తి చేసిన వారు పోస్టుకు అర్హులని చెప్పారు. ఎమ్మెస్సీ చివరి సంవత్సరం చదువుతున్న వారు సైతం అర్హులని పేర్కొన్నారు.

మాతృసంస్థకు హోంగార్డులు

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): జలమండలి విజిలెన్స్ వింగ్‌లో సుదీర్ఘకాలం పాటు పనిచేస్తున్న ముగ్గురు హోంగార్డులు మాతృసంస్థకు బదిలీ అయ్యారు. ఎం.చంద్రశేఖర్, ఎం.సుబ్బారాయుడు, సుధాకర్ బోర్డులో సుమారు 20 ఏళ్ల నుంచి హోంగార్డులుగా సేవలందిస్తున్నారు. ఇటీవల వారికి బదిలీ కావడంతో వారిని జలమండలి విజిలెన్స్ వింగ్ అధికారి గ్యానేందర్, సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

గ్రేటర్‌లో పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలతో పాటు పగటి ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా పడిపోతున్నాయి. దీంతో పగలు సైతం చలి వణికిస్తోంది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 2.5డిగ్రీలు తగ్గి 28.5డిగ్రీల సెల్సియస్‌గాను, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.5డిగ్రీలు తగ్గి 15.5డిగ్రీల సెల్సియస్‌గాను, గాలిలో తేమ 38శాతంగా నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

ఐదుగురికి అవయవదానం



మురళీ వెంకటరమణ (ఫైల్)

ఖైరతాబాద్, నవంబర్ 27: తాను మరణిస్తూ ఐదుగురికి జీవనదానం చేశాడు. జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీభూషణ్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్‌కు చెందిన కొరిపెల్ల మురళీ వెంకటరమణ (54) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 18న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. ఈనెల 26న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

కుల భవనాలను మరిచిన ప్రభుత్వం

మల్లేశ్వరపు రాజేశ్వరి

అడ్డగుట్ట, నవంబర్ 27: బీఆర్ఎస్ ప్రభుత్వహయంలో కుల భవనాలకు పునాదులు పడ్డాయని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఆ ఊసే లేదని తెలంగాణ రజక మహిళా సంఘం వ్యవస్థాపకురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులసంఘాల భవనాల నిర్మాణాలను పూర్తిగా మరిచిపోయిందని బుధవారం మెట్టుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రజకులకు మేడిపల్లిలో రెండెకరాల్లో భవనాన్ని నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైందని ఆమె తెలిపారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని, నమ్మి ఓటేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల నడ్డివిరుస్తుందని ఆమె పేర్కొన్నారు.

చేయాల్సింది ఇంకా ఉంది

పనులు పూర్తయితే అంతకు మించిన బ్యూటీ
కొత్వాల్‌గూడ ఏకో పార్క్‌పై కేటీఆర్ స్పందన

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పర్యాటకానికి వన్నె తెచ్చేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కొత్వాల్‌గూడ ఏకో పార్క్ పనులు సాగుతూనే ఉన్నాయి. తాజాగా ఓ నెటిజన్ ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. అవుటర్ రింగు రోడ్డుతోపాటు, ఏరియల్ వ్యూతో ఉన్న ఫొటోను షేర్‌ను చేశారు. ఓఆర్ఆర్‌కు సమీపంలో ఏకో పార్క్ తుది దశకు చేరుకుంది. కేటీఆర్ మానసపుత్రికగా ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుందని పేర్కొంది. దీనికి స్పందించిన కేటీఆర్.. 'ప్రాజెక్టు పూర్తి కాలేదని, అవుటర్‌కు ఇరువైపులా అనుసంధానం చేస్తూ అద్భుతమైన వంతెన రానుందని, దీంతో ఆ ప్రాంతం మరింత అద్భుతంగా మారనుంది.' అంటూ వివరించారు. 125 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పార్కులో గత ప్రభుత్వ హయాంలోనే 75శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చ్, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ వంటి పనులు జరుగుతున్నాయి. మహానగర జంట జలాశయాలకు సమీపంలో ఉన్న ఏకో టూరిజం పార్క్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకువచ్చారు. హైదరాబాద్ పర్యాటకానికి వన్నె తెచ్చే ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ భారీ వ్యయంతో చేపట్టింది. పచ్చని పరిసరాలు, అతిపెద్ద పక్షిశాల, అక్వేరియంతోపాటుగా వినోద కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలను రూపొందించారు. అందుకు అనుగుణంగా పనులు శరవేగంగా ప్రారంభించినా.. గడిచిన ఏడాది కాలంగా సాగుతూనే ఉన్నాయి. నిజానికి కొత్వాల్‌గూడ ఏకో పార్క్ అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. ఐవరీ, అక్వేరియం, బోర్డు వాక్స్, ల్యాండ్ స్కేపింగ్, వీకెండ్ క్యాంపింగ్ వంటి సదుపాయాలతో ఈ ప్రాంతానికి పర్యాటకులు వచ్చేలా చేపట్టారు. అయితే ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యం వహిస్తుండగా జాప్యం జరుగుతూనే ఉంది.

ఎస్సీ వర్గీకరణ అశాస్త్రీయం

సింహగర్జనకు లక్షలాదిగా తరలిరండి: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

శామీర్‌పేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, నేతలు

శామీర్‌పేట, నవంబర్ 27: ఓటు బ్యాంకు రాజకీయల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల-మాదిగల మధ్య వర్గీకరణ చిచ్చు పెడుతున్నాయని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. అశాస్త్రీయ వర్గీకరణ, మాలలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మాలల మహాపాదయాత్ర బుధవారం శామీర్‌పేట మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణ అంశాన్ని నెత్తినేసుకున్నారని తీవ్ర విమర్శలు చేశారు. వర్గీకరణ చేసే మొదటి రాష్ట్రం తెలంగాణనే అని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మాలలు తక్కువ ఉన్నారనే మాదిగలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తప్పుబట్టారు. వర్గీకరణ పక్కన పెట్టి, దళితులకు 25 శాతం రిజర్వేషన్‌పై పోరాటానికి మందకృష్ణ కలిసి రావాలని కోరారు. 2 శాతం లేని ఆగ్రవర్ణాలు 10 శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నారని, మంద కృష్ణ గమనించాలని హితవు పలికారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న చేపడుతున్న మాలల సంహగర్జనకు లక్షలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్‌రావు, జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బొమ్మేర్ల నాగరాజు, మురళికృష్ణ, దళితసేన మండల అధ్యక్షుడు వజ్జెల మురళి, ప్రధాన కార్యదర్శి నీరుడి బాలేశ్, మాజీ ఎంపీపీలు ఎల్లూభాయిబాబు, నాలిక యాదగిరి, మాజీ జడ్పీటీసీ అనితలాలయ్య, మాజీ సర్పంచ్ జాము రవి, భాస్కర్, బాల్‌రాజ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, నాయకులు సుధాకర్, బుర్క వెంకటేశ్, జగన్నాథం, బాలు, లింగం, మధు, రాజు, స్వామి, రవి, సోము, పరశురాం, కాళీదాస్, ప్రకాశ్, మల్లేశ్, రమేశ్, అనిల్, యాదగిరి, గణేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూరెళ్ల మహేశ్‌కుమార్

రవీంద్రభారతి, నవంబర్ 27: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.5వేల కోట్లకు పైగా ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరేళ్ల మహేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో విద్యకు ఎక్కువ బడ్జెట్ కేటాయించి నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం కల్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు పురుగుల అన్నం, ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా నరకయాతనకు గురిచేస్తున్నాడని విమర్శించారు. తక్షణమే రూ.5వేల కోట్ల బకాయి విడుదల చేసి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే భారీ ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. కూరేళ్ల ఉదయ్‌కుమార్, ఈర్ల ప్రసాద్, మేడి నాగరాజు, అనిత, మేఘన, అక్షయ, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను శ్రమదోపిడీకి గురిచేస్తున్నారు

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ

సుల్తాన్‌బజార్, నవంబర్ 27: ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగిన జీతం ఇవ్వకుండా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ విమర్శించారు. బుధవారం కోఠిలోని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఉద్యోగులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుంచి ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ గైడ్‌లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సిదేనని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము రాజేశ్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. 7 నెలల పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగుల బాల సుబ్రమణ్యం, సరికొండ సురేశ్‌గౌడ్, జనగాం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, ఎన్.శ్రీనివాస్, గౌరీ, చంద్రకళ, గౌసుద్దీన్, సతీశ్‌కుమార్, సిద్ధు, శంకర్‌నాయక్, లక్ష్మి, బాలు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఆసుపత్రులపై హైదరాబాద్ కలెక్టర్‌కు ఫిర్యాదులందడంతో సదరు ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. అందులో భాగంగానే ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-3366 నంబర్ సేవలను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని ఆసుపత్రులు, ఆల్ట్రా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు దృష్టికి వస్తే ఫిర్యాదు చేయాలని కోరారు. సోమవారం నుంచి శనివారం వరకు కార్యాలయ పనివేళలు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్‌ను అన్నీ స్కానింగ్ సెంటర్లలో బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. డిసెంబర్‌లో ఆకస్మిక తనిఖీలకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. లింగ నిష్పత్తి, లింగ వివక్షతపై అవగాహన కల్పించాలని కోరారు. స్కానింగ్ సెంటర్లలో తనిఖీ సమయంలో నిర్దిష్ట ప్రశ్నావళితో వంద మార్కులకు తయారు చేసి గ్రేడింగ్ విధానం అమలు చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన సెంటర్లు, ఆసుపత్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 78 స్కానింగ్ సెంటర్లకు అనుమతి ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులకు పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో వెంకటాచారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.అరుణకుమారి, అడిషనల్ డీసీపీ జి.మనోహర్, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట్, డీపీఆర్ఓ అబ్దుల్ కలీం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు మేకల కుమార్ తదితరులు

ఎన్నికల హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 27: రెండో విడత గొర్రెల పంపిణీ వాగ్దానం ప్రకారం ప్రభుత్వం వెంటనే పంపిణీ చేపట్టాలని మేడ్చల్ జిల్లా గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం డిమాండ్ చేసింది. జిల్లా అధ్యక్షుడు మేకల కుమార్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. గొర్రెల పెంపకంపై ఆధారపడి వేల కుటుంబాలు జీవిస్తున్నాయని, గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేపట్టి ఆదుకుందన్నారు. గొల్ల, కుర్మలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేపడుతామని ఎన్నికల హామీని నేటికీ అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాల్లో వందలాది గొర్రెలు మృతి చెందుతున్నా ప్రభుత్వం నుంచి పరిహారం అందటం లేదని విమర్శించారు. పశువైద్యశాలలో మందులు లేవని, గొర్రెల కాపరులకు రైతుబీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ ద్వారా గొర్రెల పంపిణీ చేపట్టాలని లేనిచో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధం అవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య, ఉపాధ్యక్షుడు మల్లేశ, సహాయ కార్యదర్శి గోపాల్, బాలేశ్, వీరేశ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో పడకండి

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)/అబిడ్స్: సంస్కృతి సంప్రదాయాలకు మారుపేరైన ధూల్‌పేటవాసులు గంజాయి మత్తుకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి అన్నారు. 'ఆపరేషన్ ధూల్‌పేట'లో భాగంగా గంజాయి క్రయ, విక్రయాలు, వినియోగం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం రహీంపురాలోని గౌడ మఠంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జేసీ మాట్లాడుతూ మల్లయోధులుగా, కళాకారులుగా ఎంతో పేరు ఖ్యాతి కలిగిన ధూల్‌పేటవాసుల్లో కొందరు గంజాయి మత్తులో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకోవడం దురదృష్టకరమన్నారు. గతంలో గుడంబాతో, ఇప్పుడు గంజాయి వ్యాపారంతో తమ జీవితాలను పాడుచేసుకుంటున్నట్టు వాపోయారు. మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై ఆబ్కారీ శాఖ ఉక్కుపాదం మోపుతోందని, ఇక నుంచి మరింత కఠినంగా వ్యవహరించనున్నట్టు ఆయన హెచ్చరించారు. ధూల్‌పేట ఇన్‌చార్జి నంద్యాల అంజిరెడ్డి మాట్లాడుతూ గంజాయి అమ్మకాలు నిలిపివేయకపోతే దాడులను మరింత ముమ్మరం చేసి, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్సీ భాస్కర్, సీఐలు, మధుబాబు, గోపాల్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కోటమ్మతో పాటు పలువురు ధూల్‌పేటవాసులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

విద్యార్థులు మరణిస్తుంటే విజయోత్సవాలా

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 27: రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు మరణిస్తుంటే ప్రభుత్వ పెద్దలు స్పందించకుండా విజయోత్సవాలు నిర్వహించడంపై ధర్మ స్టూడెంట్ యూనియన్ (డీఎస్‌యూ) మండిపడింది. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి వారి కుటుంబాలకు న్యాయం చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో అన్నం తిని మరణించడమేమిటని ప్రశ్నించారు. నారాయణపేట జిల్లాలో కలుషిత ఆహారం తిని, సంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో పాముకాటుకు గురై విద్యార్థులు మరణించారని గుర్తు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నత పాఠశాలలో ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురై మరణిస్తున్నా ప్రభుత్వం స్పందించ లేదని దుయ్యబట్టారు. 9వ తరగతి విద్యార్థిని శైలజ మృతిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సిటీబ్యూరో, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): బాల్య వివాహ రహిత నగరంగా హైదరాబాద్‌ను లక్ష్యంగా తీర్చిదిద్దడం కోసం ఉమెన్ ఎంపవర్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయిరాం పాల్గొని బాల్యవివాహ రహితంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని అన్నారు. అందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.